క్లుప్తంగా

ఎఫ్ఏల సంఘం ఎన్నిక

దుగ్గొండి : ఫీల్డ్ అసిస్టెంట్ల(ఎఫ్ఏ) సంఘం నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బానోత్ బాలునాయక్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల సుమలత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బుగ్గ ఐలయ్య, లలిత, జయ, కవిత, శారద, స్వర్ణ, ప్రశాంత్, రవి పాల్గొన్నారు.

తాపీమేస్త్రీ గ్రామ అధ్యక్షుడిగా మహేష్



రాయపర్తి : మండలంలోని కొండూరు తాపీ మేస్త్రీ గ్రామ సంఘాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేరెల్లి మహేష్, ప్రధాన కార్యదర్శిగా నేరెల్లి రాములు, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కోశాధికారిగా పూస సత్తయ్య, సలహాదారులుగా ఏసుబాబు, బర్ల యాకయ్య, ఎండీ అలిజాన్, దేవేందర్, నేరెల్లి సమ్మయ్య, సభ్యులుగా నేరెల్లి భిక్షపతి, సామేలు, రాజేష్, బోలేసాబ్, సైదులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన నేరెల్లి మహేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, మాజీ ఉపసర్పంచ్ కొమ్ము రాజు, పులి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పునఃపరిశీలన చేయాలి

పర్వతగిరి : మండలకేంద్రం నుంచి కల్లెడ వైపునకు వెళ్లే డీబీఎం–48 4ఆర్ కాల్వ భూమిని ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని భూ స్థల యజమానులు కోరుతున్నారు. మండల కేంద్రం గుండా వెళ్లే ఉప కాల్వ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఆ భూమిని తిరిగి స్థల యజమానులకు కేటాయించాలన్నారు.

ఇసుక లారీ స్వాధీనం



నెక్కొండ : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాలు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. రూ.40 వేల విలువైన ఇసుకలోడు లారీ సీజ్ చేశామని ఎస్సై పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సందీప్‌తోపాటు ఓనర్ సునీల్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కొండూరు మాజీ సర్పంచ్ కర్ర సరితరవీందర్‌రెడ్డి కుమారుడు కర్ణాకర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బుధవారం కర్ణాకర్‌రెడ్డి దశదినకర్మలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మధు, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ఖానాపురం : మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పర్శ సతీశ్ బుధవారం పురుషుల పొదుపు సంఘంలో చిట్టి డబ్బులు చెల్లించి, కుమార్తె పెళ్లికార్డులు ఇవ్వడానికి వెళ్లాడు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో మజీద్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న కారు సతీష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో సతీశ్ కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

కాళోజీకి నివాళి

నల్లబెల్లి : కాళోజీ వర్ధంతిని మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సాంబరావు, నర్సంపేట డివిజన్ ఉపాధ్యక్షుడు గుబరాజు, ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి కోటిలింగాచారి కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సైన్స్‌ను చేరవేస్తూ..

- 36 ఏళ్లుగా అనేక కార్యక్రమాలు
- ప్రశంసలు పొందుతున్న జనవిజ్ఞాన వేదిక
- చెకుముకి పోటీలతో అవగాహన



జనవిజ్ఞాన వేదిక సంస్థ నిర్వహించిన చెకుముకి పరీక్ష రాస్తున్న పాఠశాల విద్యార్థులు

ధర్మసాగర్ : సామాన్యులకు సైతం సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు జనవిజ్ఞాన వేదిక సంస్థ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి పలువురితో ప్రశంశలు పొందుతోంది. 1988 నుంచి దాదాపు 36 ఏళ్లుగా రాష్ట్రంలో 40 వేలకుపైగా సభ్యత్వాలు పొంది సైన్స్‌పై విస్తృత ప్రచారం చేస్తూ భారత ప్రభుత్వంచే జాతీయ అవార్డు అందుకుని సంస్థ ఖ్యాతిని మరింత మెరుగుపర్చుకుంది.

జనవిజ్ఞాన వేదిక చేపట్టిన కొన్ని కార్యక్రమాలు

విద్య అందరి హక్కు అనే నినాదంతో అక్షరాస్యత కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టి చదువు గొప్పదనాన్ని వివరించింది. మహిళల్లో చైతన్యం తీసుకొచ్చి ప్రభుత్వాలే స్వయంగా గుడుంబాను నిషేధించేలా కృషి చేసింది. సైన్స్ బోధనను మరింత మెరుగుపర్చేలా సైన్స్ ఉపాధ్యాయులకు ప్రయోగాలపై శిక్షణ ఇచ్చింది. పర్యావరణ పరిరక్షణ కోసం సైన్స్ అంటూ పలు కార్యక్రమాలు చేపట్టి ప్రజల నోట పలికించింది. మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

విద్యార్థులకు చెకుముకి పోటీలు..

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఆధునిక విజ్ఞాన శాస్త్ర అంశాలను వివరిస్తూ చెకుముకి పోటీలను నిర్వహిస్తుంది. క్విజ్, ఆక్టివిటీ, విజువల్, క్రియేటీవ్, సైన్స్ ప్రయోగాలు, రాపిడ్ ఫైర్ రౌండ్‌తో స్టేజీ క్విజ్, సైన్స్ సెమినార్లు నిర్వహిస్తుంది. విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ పెంచేందుకు జనవిజ్ఞాన వేదిక సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతూ పలువురి మన్ననలు పొందుతోంది.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

సైన్స్‌ను అర్థం చేసుకోవాలి



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి పరీక్షల ద్వారా విద్యార్థులు సైన్స్‌ను అర్థం చేసుకుని ప్రతిభను కనబర్చాలి.

- కేజీ. ధర్మప్రకాశ్, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో పోలీస్‌లు

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆత్మకూరు పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దాపూర్‌లో పోలీసులు బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అశోక్‌లేలాండ్ వాహనంలో అక్రమ మార్గంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. 60 సంచుల్లో 30 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకోగా వీటి విలువ రూ.69 వేలు ఉంటుందని అంచనా వేశామని అన్నారు. బియ్యాన్ని సీజ్ చేసి పురాణం రమేశ్, కరుణాకర్, సునీల్‌ను అరెస్టు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు.

ఐనవోలు : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా మండలంలోని పంథిని శివారు జాతీయ రహదారిపై పట్టుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. పంథిని శివారు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను తనిఖీ చేసినట్లు తెలిపారు. యూరియా సంచుల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. అందులో సుమారు 5 క్వింటాళ్ల బియ్యం లభించినట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. వరంగల్ జిల్లా ఇల్లంద గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ యాకూబ్‌అలీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఇంటింటి సమగ్ర సర్వేకు సహకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న మురళీధర్‌రెడ్డి

నడికూడ : ఇంటింటి సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మురళీధర్‌రెడ్డి కోరారు. మండలంలోని ధర్మారం గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తప్పులు లేకుండా గడువులోగా సర్వే పూర్తిచేయాలని సూచించారు. మండలంలోని అన్ని కుటుంబాల వివరాలు క్షుణ్ణంగా సేకరించి నమోదు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగశ్రీ, ఎన్యుమరేటర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో గల ఊరచెరువు కట్టపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చెరువు కట్టపై విద్యుత్ తీగలు వేలాడుతుండగా తాత్కాలికంగా కర్రలతో నిలబెట్టామని గ్రామస్తులు, రైతులు తెలిపారు. వాహనాలు వెలితే ప్రమాదకరంగా మారడంతో పాటు గాలి వీస్తే కర్ర తొలిగిపోయి విద్యుత్‌షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆరోపించారు. వేలాడుతున్న తీగలను సరిచేసి పోల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కర్రసాయంతో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

గ్రూప్- 3 పరీక్ష వాయిదా వేయాలి



శాయంపేట : నినాదాలు చేస్తున్న నాయకులు



కమలాపూర్ : మాట్లాడుతున్న దినేష్ మాదిగ

శాయంపేట : గ్రూప్– 3 పరీక్షను ప్రభుత్వం వాయిదా వేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు అరికెల్ల దేవయ్య, ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించి మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీం తీర్పుకు భిన్నంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రిజర్వేషన్లు అమలు చేశాకే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరకాల పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి మాదిగ బిడ్డలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం గట్లకానిపర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ మండల కన్వీనర్ మామిడి భాస్కర్, నాయకులు బొమ్మకంటి సాంబయ్య, భద్రయ్య, రవీందర్, కుమారస్వామి, సాంబయ్య, సదానందం, రాజు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మాదిగలపై కపట ప్రేమ చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం చేయాల్సిన సమయం వచ్చిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు కార్యచరణ ప్రారంభించలేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీని నియమించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ముత్యాల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఇనుముల చంద్రమొగిళి, ఉపాధ్యక్షులుగా ఉపేందర్, రమేశ్, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా రమేశ్, అధికార ప్రతినిధిగా భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజమల్లు ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దామెర : ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పులుకుర్తిలో చోటుచేసుకుంది. దామెర పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోవిందు రాజు(42) పేయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి 12 సంవత్సరాల క్రితం ఖిలావరంగల్‌కు చెందిన రజిత నిచ్చి వివాహం చేయగా వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా కొంతకాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరిగాయి. రజిత తన తల్లిగారింటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఖిలా వరంగల్‌కు చెందిన పరకాల సతీష్‌తో అక్రమ సంబంధం పెట్టుకొని రాజు పేరుననున్న వ్యవసాయ భూమిని తన పేరున రాయాలని ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో ఈనెల 11న తన భార్య రజితతో జరిగిన గొడవను దృష్టిలో ఉంచుకొని తీవ్ర మనస్థాపానికి గురైనా రాజు.. మంగళవారం గ్రామంలోని బస్టాండ్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. రాజు తల్లి సరోజన ఫిర్యాదు మేరకు భార్య రజిత, పరకాల సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నార్త్ నాందేడ్ అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా రామకృష్ణ



పరకాల : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నార్త్ నాందేడ్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడిగా పరకాల పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ అనుబంధ ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ ట్రేడ్ యూనియన్ జాతీయ కార్యదర్శి, సోదా రామకృష్ణ నియామకమయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ రాజేష్ లిలోథియా బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. నార్త్ నాందేడ్‌లో అత్యధికంగా వాల్మీకి కులస్తులు ఉన్నందున ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

బూత్ కమిటీలే పార్టీకి పట్టుగొమ్మలు



సమావేశంలో మాట్లాడుతున్న మొగిలి

శాయంపేట : బూత్ కమిటీలు పార్టీకి పటుగొమ్మలని బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ జన్నె మొగిలి అన్నారు. మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో బుధవారం సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్ ఆ పార్టీ మండల అధ్యక్షుడు గద్దం రమేశ్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. పార్టీకి బూత్ కమిటీలు పట్టుకొమ్మలని అన్నారు. మండలంలోని అన్ని బూత్‌ల్లో సభ్వత్వాలు పూర్తిచేయాలని సూచించారు. ప్రతీ మూడేళ్లకు ఒకసారి చేపట్టే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేయాలని కోరారు. స్వంతంగా వంద సభ్యత్వాలు చేసిన వారు క్రియాశీల సభ్యత్వానికి అర్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, నాయకులు ఉప్పు రాజు, నరహరిశెట్టి రామకృష్ణ, నాగరాజు, విద్యాసాగర్, శివ, రాకేష్‌రెడ్డి, చంద్రమౌళి, సాంబయ్య, రమేశ్, తిరుపతి, సుధాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన అవసరం



మహిళా సంఘం సభ్యులకు అవగాహన కల్పిస్తున్న సీఎఫ్ఎల్ దివ్య

వేలేరు : ప్రతిఒక్కరూ అక్షరాస్యతపై అవగాహన కలిగిఉండాలని సీఎఫ్ఎల్ మండల కౌన్సిలర్ పత్తిపాక దివ్య సూచించారు. మండలంలోని కన్నారం గ్రామంలో మహిళా సంఘం సభ్యులకు బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి ప్రమాదభీమా, జీవనజ్యోతి, సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలపై మహిళలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. అలాగే సైబర్ క్రైం మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. ఓటీపీలు ఇతరులకు, బ్యాంక్ వివరాలు ఇతరులకు చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్, వీఓఏ చంద్రమౌళి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం



పరకాల : బాసర త్రిపుల్‌ఐటీలో విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ చేపట్టి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ పరకాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిరసనకు దిగారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఏబీవీపీ నాయకుడు బానుప్రకాశ్ మాట్లాడుతూ.. విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను కలిసే ప్రయత్నం చేస్తే సెక్యూరిటీగార్డులతో దాడులు చేయించడం హేయమైన చర్య అన్నారు. వెంటనే విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి కౌశిక్, సమీర్, రమ్య, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

ఆత్మకూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో గల సబ్ సెంటర్లలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని మండల వైద్యాధికారిని డాక్టర్ స్పందన అన్నారు. నీరుకుళ్లలోని ఇమ్యూనైజేషన్ సెంటర్‌లో బుధవారం టీకాలు వేస్తున్న తీరును ఆమె పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సబ్ సెంటర్‌లో రోగులకు ఎల్లప్పుడు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పేషెంట్‌తో మాట్లాడుతున్న డాక్టర్ స్పందన

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దామెర: ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 102 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతినెలా పరీక్షలు చేసుకుని డాక్టర్ల సలహాలు పాటిస్తూ మందులు వాడాలని అన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి పాపిరెడ్డి, డాక్టర్లు కిషన్‌రావు, తయార్ మసూద్, సిబ్బంది శివకుమార్, గంగాధర్, శ్రీకాంత్, నర్సింహచారి, పోశాలు, సుమంత్ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ డాక్టర్లు

ప్రణవ్‌ను కలిసిన చైర్‌పర్సన్



ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

కమలాపూర్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకమైన తవుటం ఝాన్సీరాణి బుధవారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రణవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీధర్‌గౌడ్, కృష్ణ, విజేందర్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు చరణ్‌పటేల్, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి, రవీందర్, నాయకులు రవీందర్, ప్రసాద్, నారాయణరెడ్డి, వంశీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం సరికాదు

వేలేరు : ఓ కేసు విషయంలో తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని ఎస్సై అజ్మీరా సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన కేసు విషయంలో నింధితులను రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. అయితే కేసును సెటిల్‌మెంట్ చేసి బాధితులకు డబ్బులు ఇప్పించాలని అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ మాజీ ప్రజాప్రతినిధి స్టేషన్‌కు వచ్చి ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టి నింధితులను కోర్టులో హాజరుపర్చడం వరకే పోలీసుల బాధ్యత ఉంటుందని, సెటిల్‌మెంట్ చేసే అధికారం తమకు లేదని చెప్పినట్లు పేర్కొన్నారు. తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని ప్రకటనలో స్పష్టం చేశారు.

బీమా చేసుకోవాలి

పరకాల : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఋణం పొందిన ప్రతి సభ్యుడు ఇన్సూరెన్స్ చేసుకోవాలని మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి కోరారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన మాదారం పీఏసీఎస్ సభ్యుడు, నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన మహ్మద్ జైనోద్దీన్ ఇన్సూరెన్స్ చెక్కును ఆయన భార్య చోటిమాకు బుధవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంఘంలో ఋణం పొందిన వారు ఇన్సూరెన్స్ చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

‘భగీరథ’ గేట్‌వాల్వ్‌కు కేసింగ్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

నడికూడ : మండల కేంద్రం నుంచి ధర్మారం వరకు రోడ్డుకు ఆనుకుని మిషన్ భగీరథ గేట్ వాల్వ్‌లు ప్రమాదకరంగా కనిపించాయి. ఈ మేరకు సాక్షిలో ఈనెల 9వ తేదీన ‘గాయపరుస్తున్న గేట్‌వాల్వ్’ శీర్షికతో కథనం ప్రచురించింది. దీంతో ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి స్పందించారు. గేట్‌వాల్వ్‌కు కేసింగ్ ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. గురువారం కేసింగ్ పనులను ప్రారంభమయ్యాయి. సమస్య పరిష్కారానికి కృషిచేసిన సాక్షి దినపత్రికకు స్థానికులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



ధర్మారంలోని గేట్‌వాల్వ్‌ల చాంబర్‌లో ఇసుక నింపుతున్న జీపీ సిబ్బంది

నూనెగింజల పంటసాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాజన్న

వేలేరు : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కృష్ణోన్నతి పథకంలో భాగంగా మండలంలోని ఎర్రబెల్లి గ్రామ రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న నూనెగింజల పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. విదేశాల నుంచి మన దేశానికి 57 శాతం నూనెలను దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. మనదేశంలోని రైతులు వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలను అధికంగా సాగు చేయాలని కోరారు. వేరుశనగ పంటలో ప్రస్తుతం ఆకుముడత, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో వాటిని తొలగించవచ్చన్నారు.